క్లుప్తంగా

## కోదండ రాముడికి లక్ష తులసీ దళార్చన



**మచిలీపట్నంటౌన్:** నగరంలోని నిజాంపేట శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా రెండో రోజైన బుధవారం స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామికి లక్ష తులసీదళార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం సీతారాముల శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రాగా తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం కూడా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## మెప్మా ఆర్పీ ఇంటి ముందున్న బల్లలు ధ్వంసం

**మచిలీపట్నం టౌన్:** ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పని చేసిందనే అనుమానంతో నగరంలోని ఆరో డివిజన్ గాంధీ నగర్‌లో నివాసముంటున్న మెప్మా రిసోర్స్ పర్సన్ ఇంటి ముందు కూర్చోవడానికి ఉపయోగించే నాపరాయి బల్లలను ధ్వంసం చేయించారు. టీడీపీ విజయం అనంతరం ఆర్పీ ఇటీవల ఆ డివిజన్ టీడీపీ నాయకుడిని కలసి అభినందనలు తెలిపేందుకు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద లేని నాయకుడికి ఫోన్ చేయగా నీవు ఎన్నికల్లో ఏ పార్టీకి పని చేసి ఓట్లు వేయించావో తెలుసునని నీ ఇంటి ముందున్న బల్లలను తొలగిస్తానని హెచ్చరించాడు. అన్నట్లుగానే బుధవారం ఉదయం మున్సిపల్ రోబోతో బల్లలను తొలగింప జేశారు.

## కాశీ విశ్వేశ్వరునికి రుద్రాభిషేకం

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** మండల పరిధిలోని పెదకల్లేపల్లి పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. అందులో బాగంగా బుధవారం ఉదయం 8.10 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, రాత్రికి మహాశాంతి హోమాలు నిర్వహించారు. సాయంత్రం సర్వతోభద్ర మండప ఆవాహన కలశస్థాపనతోపాటు ఆలయం ఎదుట మహాశివుని రూపంలో దీపారాధనలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రుద్రాభిషేకం పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

## 23న కంటి వైద్యశిబిరం

**నాగాయలంక:** జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు (మర్రిపాలెం) ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 70936 17778లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

## రామోజీరావుకు నివాళి



**పెడన:** ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావుకు పెడన ప్రెస్ క్లబ్ సంతాపం తెలియజేసింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రెస్ క్లబ్‌లోని పాత్రికేయులు రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్టు కృష్ణప్రసాద్, రాజేంద్రప్రసాద్, వై సుబ్రమణ్యం, వెంకట్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో ప్రమాణస్వీకార వీక్షణం

**గూడూరు:** ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గూడూరు మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు తమ తమ సచివాలయాలలో ప్రజలు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకరోత్సవాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా టెంట్లు, కుర్చీలు వేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీల ద్వారా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. స్థానిక అధికారులు, ఆయా పార్టీల శ్రేణులు ప్రత్యక్ష ప్రసారాలను తిలకించారు.

# పన్నుల వసూళ్లలో వెనుకంజ

- 2022–23లో 9 పంచాయతీలలో నూరుశాతం వసూళ్లు
- 2023–24లో 4 పంచాయతీలలో మాత్రమే నూరుశాతం
- 85 నుంచి 70 శాతానికి పడిపోయిన ఆదాయం
- ఆరు శాతం వసూలుతో ఆఖరున నిలిచిన లంకలకలువగుంట
- వెనుకంజలోనే కొంకేపూడి, చోడవరం పంచాయతీలు



పెనుమల్లి గ్రామం



గురువిందగుంట గ్రామ సచివాలయం

**పెడన:** పంచాయతీలలో ఆస్తి పన్నులు వసూళ్ల విషయంలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది తక్కువగానే వసూలయింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉన్నా పన్నుల వసూళ్లలో వెనుకబాటుతనం ఉండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఏడాదికి ఆ ఏడాది పన్నులు సక్రమంగా వసూళ్లు చేసి పురోగతిలో ఉంచుకోవాల్సిన పరిస్థితి పెడన మండలంలో కానరావడం లేదు. 2022–23 ఏడాదిలో 85 శాతం పన్నులు వసూళ్లు చేస్తే 2023–24లో ఆ పన్నులు కాస్తా 70 శాతం మాత్రమే వసూళ్లు చేయడం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోంది. 15 శాతం మండల పరిషత్ ఆదాయం పడిపోయింది.

**2022–23లో 9 పంచాయతీలు వందశాతం**

పెడన మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 24 పంచాయతీలలో తొమ్మిది పంచాయతీలు వంద శాతం పన్నులు వసూళ్లు చేశాయి. చేవేంద్ర, గురువిందగుంట, కొంగంచర్ల, మడక, నందమూరు, నేలకొండపల్లి, పెనుమల్లి, పుల్లపాడు, శేరివత్తర్లపల్లి పంచాయతీలున్నాయి. 47 శాతం వసూళ్లు చేసి కొంకేపూడి పంచాయతీ వెనుకంజలో నిలిచింది. ఈ ఏడాదిలో 85.06 శాతం పన్నులు వసూళ్లు చేశారు. డిమాండ్ రూ.1.07కోట్లు ఉంటే రూ.91.33లక్షలు వసూళ్లు అయ్యాయి.

**నాలుగు పంచాయతీలు మాత్రమే..**

2023–24 ఆర్థిక సంవత్సరంలో గురువిందగుంట, కొంగంచర్ల, నేలకొండపల్లి, పెనుమల్లి పంచాయతీలున్నాయి. ఈ నాలుగు పంచాయతీలు కూడా గత ఏడాది వంద శాతం వసూళ్లు చేసిన వాటిల్లో నిలిచాయి. ఈ సంతవ్సరంలో లంకలకలువగుంట పంచాయతీ 5.4 శాతం పన్నులు మాత్రమే వసూళ్లు చేసి చిట్టచివరిన నిలిచింది. ఆ తరువాతి స్థానాల్లో కొంకేపూడి, చోడవరం పంచాయతీలు 23 శాతం మించి వసూళ్లు చేయలేదు. 25 శాతం నుంచి 50 శాతం లోపు వసూళ్లు చేసిన పంచాయతీలలో ఉరివి ఉండగా 51 నుంచి 60 శాతం పరిధిలో కాకర్లమూడి, నడుపూరు, పుల్లపాడు పంచాయతీలు ఉన్నాయి. 61 నుంచి 90 శాతం లోపు చెన్నూరు, జింజేరు, కమలాపురం, కోడూరు, మడక, ముచ్చర్ల, నందమూరు, నందిగామ, శేరివత్తర్లపల్లి పంచాయతీలు ఉన్నాయి. 91 శాతం నుంచి వంద లోపు వసూళ్లు చేసిన పంచాయతీలలో అచ్చయ్యవారిపాలెం, బల్లిపర్రు, చేవేంద్ర, కొప్పల్లి పంచాయతీలున్నాయి. డిమాండ్ రూ.1.10కోట్లు ఉంటే రూ.78.35 లక్షలు మాత్రమే వసూలు చేయగలిగారు.

**సార్వత్రిక ఎన్నికల వల్ల వెనుకబడ్డాం**



వాస్తవంగా గత ఐదేళ్లుగా పన్నులు వసూళ్లు పరిశీలిస్తే ముందంజలోనే ఉన్నాము. 2023–24 ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లు మందకొడిగా సాగాయి. వాటికి తోడు మిచాంగ్ తుఫాను పంట నష్టపోయి రైతులు పన్నులు కట్టడానికి ఆసక్తి చూపలేదు. దీంతో పన్నులు వసూళ్లు మందకొడిగానే అయ్యాయి. రానున్న ఏడాదికి ఆ పరిస్థితి ఉండదు. పన్నులు వసూళ్లు బాగానే జరుగుతాయని అనుకుంటున్నా. సిబ్బంది కూడా అంతా అందుబాటులో ఉండి పన్ను వసూళ్లపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

–ఎం.జయరామ్, ఈవోపీఆర్డీ, పెడన మండలం

# పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



హెచ్ఎంలకు విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం



ప్రత్యేక వాహనాల్లో పుస్తకాలను తరలిస్తున్న ఉపాధ్యాయులు

**గూడూరు:** పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే గూడూరులోని స్టాక్ పాయింట్‌కు చేరుకున్న పాఠ్యపుస్తకాల కిట్లను పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం గురువారం పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో పాఠ్యపుస్తకాలతో పాటుగా నోట్ బుక్స్, బ్యాగు, బెల్టు తదితర సామగ్రి ఉన్నాయి. విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలు ప్రారంభం కానున్నందున మొదటి రోజే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కిట్లను పంపిణీ చేయాలని సుబ్రహ్మణ్యం ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

**కోడూరు:** నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు బుధవారం సంబంధిత పాఠశాలలకు చేరాయి. కోడూరు ఎమ్మార్సీ కార్యాలయం నుంచి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను 47 ఎంపీపీ, ఎంపీయూపీ, జెడ్పీ పాఠశాలలకు పంపించారు. 47 పాఠశాలలకు సంబంధించి తొలి విడతగా 16,068 పాఠ్యపుస్తకాలు, 12,688 నోట్ పుస్తకాలను అందించినట్లు ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో పాటు 1,567 బెల్టులను కూడా పాఠశాలల ఉపాధ్యాయులకు అందించినట్లు చెప్పారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ఎంఈఓలు తెలిపారు. తొలిరోజు విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేయాలని ఉపాధ్యాయులను ఎంఈఓలు ఆదేశించారు. పుస్తకాలను ఉపాధ్యాయులు ప్రత్యేక వాహనాల్లో పాఠశాలలకు తరలించారు.

# నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం



పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు అందజేస్తున్న ఎంఈఓలు

- పుస్తకాలు, బ్యాగులు సిద్ధం
- జగనన్న విద్యాదీవెన కిట్లకు స్టూడెంట్ కిట్లుగా పేరు మార్పు

**బంటుమిల్లి:** మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం నమోదైన హాజరు మేరకు విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, బ్యాగులను ప్రభుత్వం సిద్ధం చేసింది. పాఠశాలల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తరగతి గదులు, ఆవరణలు శుభ్రం చేయించారు. గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు టీసీలు, ఇతర సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. కొత్త విద్యార్థుల ప్రవేశాలకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మండలంలోని 56 పాఠశాలల తలుపులు నేడు తెరుచుకోనున్నాయి.

**విద్యా దీవెన కిట్ల పేరు మార్పు..**

గత ఐదు సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన జగనన్న విద్యా దీవెన కిట్లను తాజా ప్రభుత్వం స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చింది. ఇందులో భాగంగా ఈ రోజు పాఠశాలలు తలుపులు తెరుచుకోనున్న క్రమంలో విద్యార్థులకు అందజేసే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు టి. బాలసరస్వతి, ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తదితర 56 పాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి వరకు 3,027 మంది విద్యార్థులు నమోదై ఉన్నారన్నారు. నోట్ పుస్తకాలు, బ్యాగులు వంద శాతం, పాఠ్యపుస్తకాలు 89 శాతం వచ్చాయన్నారు. షూస్, బెల్ట్, టైలు ఇంక రావలసి ఉందని ఎంఈఓలు పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత కొత్తగా చేరే విద్యార్థులకు మరలా ఇండెంట్ ద్వారా కిట్లు తెప్పిస్తామని వారు చెప్పారు. ఇది ఇలా ఉంటే జగనన్న విద్యా కానుక కిట్లను స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చి, స్కూలు బ్యాగులపై ఎటువంటి ముద్రణ లేకుండానే పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. అయితే వీటిలో గత ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యాదీవెన బ్యాగులను కూడా కొత్త బ్యాగులతో కలిపి పాఠశాలలకు పంపుతున్నారు.

# విద్యుత్ వెలుగుల్లో సచివాలయాలు



విద్యుత్ దీపాలంకరణలో కొప్పెల్లి గ్రామ సచివాలయం

**పెడన:** జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికాధికారి ఆదేశాలతో మండలంలోని గ్రామ సచివాలయాలు విద్యుత్‌దీపాలంకరణలతో దర్శనమిచ్చాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని ప్రతి మండలంలోని గ్రామ సచివాలయాలను, మండల పరిషత్ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని జెడ్పీ సీఈవో మంగళవారం జారీ చేసిన ఆదేశాలతో మండలంలోని ఎంపీడీవో వీ రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరామ్‌లు ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సచివాలయాలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఉదయం ఆయా సచివాలయాల్లో ఎల్ఈడీలు ద్వారా ప్రమాణస్వీకారాన్ని వీక్షించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

## మంత్రి రవీంద్రను కలిసిన జనసేన నేతలు



**మచిలీపట్నంటౌన్:** రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొల్లు రవీంద్రకు మచిలీపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ వెళ్లి మంత్రి కొల్లు రవీంద్రను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మండల అధ్యక్షుడు గల్లా తిమోతి, నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్ ఉన్నారు.

# పద్య నాటకోత్సవాలు ప్రారంభం



పర్యావరణ ప్రాణదాతల నాటకంలో ఓ సన్నివేశం

ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహణ

**చల్లపల్లి(అవనిగడ్డ):** స్థానిక ఎన్‌టీఆర్ పార్కులో పద్యనాటోత్సవ కార్యక్రమాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో బోలెం భాస్కరరావు ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో చేపట్టిన ఈ నాటకోత్సవాలను కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని–మల్లేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవనిగడ్డకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**ఆలోచింపజేసిన పర్యావరణ ప్రాణదాత నాటకం..**

ఈ సందర్భంగా ప్రదర్శించిన పర్యావరణ ప్రాణదాతల నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. తాటిచెట్టు ఉపయోగాలు, ఈ చెట్లను ఇష్టారాజ్యంగా కొట్టేయడం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలను రంగస్థల కళాకారుడు బోలెం రామారావు ప్రధాన పాత్రలో చేసిన అభినయం విశేషంగా ఆకట్టుకుంది. జాషువా చెప్పులు కుట్టే పాత్రధారిగా రామారావు నటన ప్రేక్షకులను కట్టిపడేసింది. దేశ నాయకుల ఫొటోలు చూపిస్తూ వారి జీవిత విశేషాలను తెలియజేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రముఖ కోలాటం గురువు వేముల అంకంభొట్లు, ఏవో బోలెం అనంతలక్ష్మి, నాగమునేష్, నిర్దేష్ సాయి, జిన్నీ వారి వారి పాత్రల్లో జీవించారు. స్వచ్ఛసుందర చల్లపల్లి నిర్వాహకుడు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈవోపీఆర్‌డీ దాసి సీతారామరాజు, రంగస్థల కళాకారుడు పుప్పాల వీరాంజనేయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, బుల్లా కిశోర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మరియతల్లి గ్రామోత్సవం



**ఉల్లిపాలెం(కోడూరు):** మండల పరిధిలోని ఉల్లిపాలెం ఏసు తిరుహృదయ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి) వందేళ్ల వేడుకల్లో భాగంగా బుధవారం మరియతల్లి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో మరియమాత స్వరూపాన్ని ఉంచి విశ్వాసులు భుజాలకెత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. కోడూరు ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు చౌటపల్లి ప్రశాంత్ విశ్వాసుల ఇళ్ల వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా విశ్వాసులు మరియతల్లి స్వరూపానికి ఎదురేగి ఆమె పాదాలను ముద్దాడి చేతులు జోడించి నమస్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ భక్తులు గ్రామోత్సవంలో ముందుకు సాగారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌సీఎం సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు పర్యవేక్షించారు.

# డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టిన రైతులు



మరమ్మతుల అనంతరం ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్

**బంటుమిల్లి:** మండల పరిధిలోని ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, మట్టి పూడికలను డ్రెయిన్ పరిధిలోని గ్రామాల రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారు. ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్ పరిధిలో ఆముదాలపల్లి, లక్ష్మీనారాయణపురం, ములపర్రు, రామవరపుమోడి పంచాయతీల పరిధిలోని వందలాది ఎకరాల మాగాణి భూములు ఉన్నాయి. ఈ డ్రెయిన్‌లోని మురుగు నీరు దాదాపు 7 కి.మీ ప్రయాణించి చోరంపూడి పంచాయతీ శివారు వడ్లగరువు గ్రామ సమీపంలో చోరంపూడి మీడియం డ్రెయిన్‌లో కలుస్తుంది. డ్రెయిన్ పరిధిలోని గ్రామాల రైతులు కమిటీగా ఏర్పడి ఎకరాల లెక్కన సొమ్ములు వసూలు చేసి పనులు చేపట్టారు. దాదాపు రూ.5 లక్షలు వెచ్చించి సుమారు 5 కి.మీ డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క, పూడిక మట్టి తీయించి గట్లు బలోపేతం చేసుకున్నారు. మిగిలిన 2 కి.మీ డ్రెయిన్ మరమ్మతు పనులు రైతుల శక్తికి మించింది కావడంతో నిలిపివేశారు. ఈ డ్రెయిన్‌పై వడ్లగరువు గ్రామం వద్ద సైఫన్ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న సైఫన్‌కు ఉపయోగించిన పైపులు ఏర్పాటు చేసి దాదాపు 50 సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకు చేరి పైన పంట కాలువలోని నీరు డ్రెయిన్‌లోకి చేరుతోంది. అలాగే గట్లు బలహీనంగా ఉన్నందున జేసీబీ నడిచే మార్గంలేదు. డ్రెయిన్‌లో నీరు ఉన్న సమయములో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకుని, దానిపై జేసీబీ ఉంచి డ్రెయిన్ తవ్వకం చేయాల్సి ఉంది. డ్రెయిన్ చివరి భాగంలో అడ్డంకులు తొలగించకపోతే రైతులు ఇంత వరకు చేసిన పని, చేసిన లక్షల ఖర్చు నిరుపయోగం అవుతుంది. అధికారులు స్పందించి వడ్లగరువు గ్రామం వద్ద శాశ్వత సైఫన్ నిర్మాణం చేపట్టి మిగిలిన డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, పూడిక మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై డ్రెయినేజీ ఏఈఈ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్‌పై సైఫన్ నిర్మాణానికి, డ్రెయిన్‌లో మిగిలిన మరమ్మతు పనులకు అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపి మంజూరుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# డ్రెయిన్‌లో చేపల లోడులారీ బోల్తా



పెదతుమ్మిడి డ్రెయిన్‌లో బోల్తా కొట్టిన చేపల లోడు లారీ

**బంటుమిల్లి:** మండల పరిధిలో బంటుమిల్లి–గుడివాడ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పిన లారీ పెదతుమ్మిడి మీడియం డ్రెయిన్‌లో బోల్తా కొట్టింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం ఏపీ39టీఏ 4689 నంబరు లారీ కైకలూరులో చేపల లోడు చేసుకుని బీహార్ రాష్ట్రానికి వెళ్లేందుకు బయలుదేరింది. బంటుమిల్లి వద్ద 216 జాతీయ రహదారి ఎక్కేందుకు బంటుమిల్లి రోడ్డులో వస్తోంది. ఈ క్రమంలో పెదతుమ్మిడి మీడియం డ్రెయిన్‌పై ఉన్న వంతెన బలహీనంగా ఉండటంతో ఎదురుగా వేగంగా వస్తున్న కారును తప్పించబోయి లారీ అదుపు తప్పి డ్రెయిన్‌లోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి స్థానికులు తరలించారు. కైకలూరులో యజమానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

## భూసార పరీక్షలు చేయించాలి

**విస్సన్నపేట:** పంట పొలాల్లో భూసార పరీక్షలు, మట్టి నమూనా పరీక్షలు చేయించాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులకు మట్టి నమూనా సేకరణపై బుధవారం సమావేశం నిర్వహించారు. రైతుల పంట పొలాల్లో భూసార పరీక్షలు, మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి నరేంద్ర పాల్గొన్నారు.

# ఈఏపీ సెట్ ర్యాంకర్లకు అభినందన

**తిరువూరు:** స్థానిక శ్రీనిధి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివి, ఏపీ ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఈఏపీ సెట్ ర్యాంకర్లు షేక్ సానియా, ఆకుల అనూష, ముత్యాల యశస్విని, కోలా కేశవ్, టేకు రాము, కొప్పెర భవ్యశ్రీ, మనుబోతుల బాలాజీ, జానూతల ఫణీంద్రకుమార్‌లను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ వేగి శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

# బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వి. వెంకటేశ్వరరావు

**నూజివీడు:** బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని నూజివీడు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు అన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్‌లో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా నేరమని, దీనిపై యజమానులకు జరిమానా విధించవచ్చని చెప్పారు. పిల్లలను పనికి కాకుండా బడికి పంపాలనే ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండాలన్నారు. నూజివీడు అసిస్టెంట్ లేబర్ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఎక్కడైనా 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను పనిలో పెట్టుకుంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. పనిచేస్తున్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, న్యాయవాది చిన్నికృష్ణ పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో బడిబాట



గానుగపాడులో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**తిరువూరురూరల్:** మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గానుగపాడులో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పలు సౌకర్యాలను వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, తల్లి ఖాతాలో నగదు జమ, మధ్యాహ్న భోజన పథకం తదితర సదుపాయాలను తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. చిట్టేల ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో ప్రవేశం కల్పించారు. చదువుకునే వయసులో పిల్లలను పనులకు పంపవద్దని, బాల కార్మికులను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఉపాధ్యాయులు వినయ్‌ఉమార్, కొండలరావు తెలిపారు.